

# కథా కౌముది

## తుపాకి పేలింది

పి.చంద్రశేఖర అజాద్



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో బహుమతి పొందిన కథ

"అమ్మాయి పేరు ఏంటన్నావు"? అన్నాడు శీను.

"కుసుమకుమారి".

"కుసుమ చాలు. కుమారి వద్దు. ఈ ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరోయిన్లకి రెండు మూడు అక్షరాల పేర్లు వుండాలి. అఫ్ కోర్స్ టీ.వీ. కయినా! ఇక్కడ ఇంకో సెంటిమెంట్ వుంది. 'కుమారి' అనుంటే ఇంక జీవితంలో కుమారిగానే వుండాలి".

"కుసుమ చాలండి. మా అమ్మా నాన్నలు 'కుసుమ' అనే పిలుస్తారు" అంది కుసుమ కుమారి.

"మరెందుకమ్మా కుమారి అని ఏడింగ్ లు... ఇప్పుడు మీకు కొన్ని నిజాలు చెప్పాలోయ్. నీ పేరేంటన్నావు?"

"రచిత్".

"నీకీ పేరు ఎవరు పెట్టారు"

"మా తాతగారండి".

"అలాగా ఆయన్నో సారి కలవాలనుంది. మా జోగిగాడు మిమ్మల్ని నా దగ్గరకు పంపాడు. నా పేరు గురించి చెప్పాడా?"

"శీను అన్నారండి".

"కాదు. ఆడు మొహమాటపడ్డాడు. నన్ను ఇండస్ట్రీలో 'కిలాడి' అని పిలుచుకుంటారు. కిలాడి ఫేమ్ అన్నమాట. ఇంతకు ముందు నేను కూడా హీరో అవుదామని వచ్చాను. తర్వాత నిర్మాత అయ్యాను. మనం తీసిన సినిమా పేరు 'కిలాడి'. చీదేసింది. అప్పటి నుండి మేనేజర్ ని అయ్యాను. ఇప్పుడు మీలాంటి యూత్ ని పైకి తీసుకొచ్చే పనిలో వున్నాను" అన్నాడు కిలాడి.

"చాలా సంతోషం సార్".

"మీ ఇద్దరూ ప్రేమించుకున్నారా?"

"లేదండి" అంది కుసుమ కంగారుగా.

"రచిత్ ని చెప్పనీయమ్మా"

"లేదు సర్. కుసుమకి చిన్నప్పటి నుంచి నటన అంటే ప్రాణం. చిన్నచిన్న నాటికల్లో నటించింది. బహుమతులు కూడా వచ్చాయి" అన్నాడు రచిత్.

"ఇంట్లో చెప్పి వచ్చారా?"

"మా అమ్మా నాన్నలే పంపించారు సర్" అంది కుసుమ.

"అదృష్టమంతులు కుసుమా. ఇక్కడ నాలాంటి బాపతు చాలామందున్నారు. ఇంతకు ముందు సర్కార్ ఎక్స్ ప్రెస్ లో మద్రాసుకి, ఇప్పుడు రకరకాల ఎక్స్ ప్రెస్సుల్లో హైదరాబాద్ ఇంట్లో చెప్పకుండా వచ్చిన వాళ్లమే. అమ్మా నాన్నలు హీరోయిన్లు కమ్మని పంపిస్తున్నారంటే వాటే ఛేంజ్!" అన్నాడు కులాసాగా.

"మీ కో-ఆపరేషన్ వుంటే మేం విజయం సాధిస్తాం సర్" అంది కుసుమ.

"ఏం చదువుకున్నావమ్మా?"

"ఇంటర్ పాసయ్యాను శీనుగారూ".

"ఇక్కడ కావలసింది నా కో-ఆపరేషన్ కాదమ్మా. నిర్మాతలది, దర్శకులది, మీడియా వాళ్లదయ. ఇంకా చాలా కావాలి. దాంతో పాటు నుదుటి మీద కసింత అదృష్టరేఖ వుండాలి" అని నుదురు కేసి చూస్తుంటే కుసుమ సిగ్గుపడింది.

"నేను చేయగలిగిందొకటే. మీరు మొదటి మెట్టు ఎక్కటానికి సాయం. అంటే మీ తొలి పాదం నా వెన్నముక మీద వేస్తారన్న మాట".

"అంత మాట అన్నారేంటి? మేం అలాంటి వాళ్లం కాదు" అంది బాధగా కుసుమ.

"నీ అదృష్టం బాగుంటే రేపు నన్ను హూ ఆర్ యూ అని అడుగుతావు".

"దేవుడి మీద ప్రమాణం చేస్తున్నాం. మీరు మా దేవుడు" అన్నాడు రచిత్.

"రచితూ... మీరు ఇప్పుడు వస్తున్నారు. ఇక్కడ నేను చాలా సంవత్సరాల నుండి వుంటున్నా. ఇప్పుడా డిస్కషన్ ఎందుకు గాని మీ ఇద్దరూ ఎక్కడుంటున్నారు?"

"తెలిసినవారి ఇంటిలో వుంటున్నాం".

"ఒకే గదిలోనా?"

"శీను గారూ... కుసుమ నా సిస్టర్ అవుతుంది. మా తాతగారు, కుసుమ అమ్మా నాన్నలు ఫ్రెండ్స్. మాకు కళ తప్ప ఇంకోటి పట్టదు".

"బాగుందయ్యా... ఇప్పుడు మనం పరమాత్మగారి దగ్గరకు వెళ్తున్నాం".

"ఆయనెవరు సర్. నిర్మాతా, దర్శకులా, రచయితా, డాన్స్ మాస్టరా?"

"అబ్బో... నీకు ఇరవై నాలుగు క్రాఫ్ట్స్ మీద అవగాహన వుందనుకుంటా... ఆయన ఇందులో ఎవరూ కాదు. మేధావి. ఆయనకు తెలియని విషయం లేదు. కాకపోతే టీ.వీ.లకు సినిమాలకు పని చేయరు. కళలంటే ప్రాణం. ముందాయన బ్లెస్సింగ్స్ తీసుకుంటే సగం సక్సెస్. మనం పనిలోకి దిగిపోవచ్చు" అన్నాడు శీను.

"ఎప్పుడు కలుద్దామంటారు?"

"ఆలస్యం అమృతం విషం అన్నారు. అదిగో ఆ మేడ మీద వుంటారు. ఇప్పుడే కలుస్తున్నాం".

"పండ్లూ లాంటివి తీసుకుంటే" నసిగింది కుసుమ.

"లోపలకి రానీయడు. పదండి".

అందరూ మెట్లు ఎక్కుతున్నారు. "పెద్దపెద్ద మెట్లు కట్టారు" అంది కుసుమ మెల్లగా.

"నువ్వు సంపాదించాక మంచి ఇల్లు కట్టుకుందువు గాని. అందులో లిఫ్ట్ వుంటుంది. బయటకు వస్తే ఆడి కారుంటుంది. గార్డెనూ–పనోళ్లూ..." అంటుంటే "అంత పెద్ద కలలు మాకు లేవు సర్" అన్నాడు రచిత్. "మాకు అనకు. కుసుమ గురించి చెబుతున్నా" అన్నాడు. తలుపులు తెరిచి వున్నాయి.

"గురువు గారూ వందనం" అన్నాడు కిలాడి.

"ఏంటోయ్. నీతో ఇద్దర్ని తీసుకొచ్చావు. బంధువులా? స్నేహితులా? పరివారమా?"

"పరమాత్మ గారూ... మీరు కళాకారులు. తమరి దర్శనం చేయిద్దామని తీసుకొచ్చాను" .

"శీనూ... నేను భగవంతుడ్నా, కనీసం స్వామీజీనా నా దర్శనం చేయించటానికి".

"అంత కంటే ఎక్కువ!"

"దాన్నే కిలాడి తనం అంటారు!" అన్నాడు పరమాత్మ. "నీ పేరేంటమ్మాయ్?" అనడిగాడు తర్వాత.

"కుసుమ సర్".

"సర్ ఎందుకులే. నీ పేరంటబ్బాయ్?"

"రచిత్ అండి".

"మీ ఇద్దరూ నటించటానికి వచ్చారా? గాయనీ గాయకులా? నర్తకులా?"

"కుసుమ నటించాలనుకుంటోంది. నేను సినిమాలకు, టీ.వీ.లకు కథలూ, సంభాషణలు అందించాలనుకుంటున్నాను" అన్నాడు రచిత్.

"అది నీ కలం పేరా?"

కాదండి. "నా పేరే!"

"కుసుమా డబ్బు సంపాదించటానికి నువ్వు నటించాలనుకుంటున్నావా?"

"అదీ..." అని నసిగి.... "అది కూడా నండి" అంది.

"శుభం. నేను కళ కోసం వచ్చానంటే నమ్మేవాడిని కాదు. కూర్చోండి" అన్నాడు.

"నేను ముందుగా చెప్పానండి. అయ్యగారి ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పాలని పరమాత్మగారు మా గురూజీ అని".

"ఆ పదం యిబ్బందిగా వుందోయ్. నిన్ను కిలాడి సినిమా తీయమని నేను చెప్పానా? ఇక్కడ గురువులూ-శిష్యులూ వుండరు. అందరూ బోధకులే" అని... "రచిత్... నువ్వు కథలూ, నాటికలు రాశావా?"

"లేదండి"

"పోనీ తెలుగు సాహిత్యం చదివావా?"

"సాహిత్యం కంటే సినిమాలు చూస్తానండి"

"సినిమాలు చూసి సినిమా కథలు రాస్తావా? అంటే వచ్చిన సినిమాల్లో దృశ్యాల్ని మిక్సీలో వేసి రుబ్బుతావన్నమాట" అన్నాడు పరమాత్మ. నిశ్శబ్దం.

"నా వంక చూస్తావేంటి పెద్దాయన ప్రశ్నకు జవాబు చెప్పు" అన్నాడు కిలాడి.

"కనీసం పత్రికలన్నా చదువుతావా?" పరమాత్మ ప్రశ్న.

"నిజం చెప్పాలంటే సినిమా వార్తలు చదువుతానండి. నాకు సినిమా తప్ప ఇంకో ప్రపంచం లేదు. తాతగారి కథలు చదివాను" భయంగా అన్నాడు రచిత్.

"ఆయన రచయితన్న మాట. సినిమాలకు పని చేశారా?"

"చేయాలనుకున్నారు. ఉద్యోగం విడిచిపెట్టి రావటానికి ధైర్యం చేయలేదు. అందుకే నన్ను ఈ రంగంలోకి పంపించారు".

"ఈ అమ్మాయి వెనక కూడా ఇలాంటి కథ వుందా?"

"నేను కూచిపూడి-భరతనాట్యం నేర్చుకున్నాను. నాటికల్లో నటించానండి".

"సంతోషం. ఈ రంగం ఊబిలాంటిది. ఇందులో దిగకండి అని నేను చెప్పినా మీరు వినే స్థితి దాటివచ్చారు. రచిత్-మీ తాతగారికి చెహోవ్ తెలుసా?" అన్నాడు పరమాత్మ.

"తెలుసనుకుంటానండి".

"ఇక్కడికి వచ్చే ముందు పాఠాలు నేర్చారా! అంటే కథ-స్క్రీన్ ప్లే-సంభాషణలు. వీటిలో మెళకువలు లాంటివి".

"నేను రాసిన కొన్ని కథలు మా తాతకి చెప్పాను. బాగున్నాయన్నారు".

"తాత కాకికి మనవడు కాకి ముద్దు నాయనా-అప్పటి దాకా తాత కాకికి ఎలాంటి వుండేలు దెబ్బ తగలకుండా వుంటే" అనగానే రచిత్ ముఖం మాడిపోయింది.

"పెద్దాయన అలా అంటున్నారని నిరుత్సాహపడకు రచిత్. పరమాత్మ గారు నాకు ముందే పరిచయం అయి వుంటే నేను కిలాడి సినిమా ఎందుకు తీస్తాను!"

"నేను తప్పుగా అనుకోను. వారు అన్నట్లు కాకి పిల్ల కాకికి ముద్దు. కాకి పిల్ల అందరి ముద్దు కావాలంటే ఏం చేయాలో వారి నుండి నేర్చుకుంటాను" అన్నాడు వినయంగా.

"నీ కంత వివరంగా చెప్పే సమయం నాకుండదు. నీకు అనుభవం రావాలంటే రెండు టీ.వీ. సీరియల్స్ కి, నాలుగు సినిమాలకు పని చేయి. షూటింగ్ ల దగ్గరకు ముందు వెళ్లు. అంతా కాకున్నా కొంత బోధ పడుతుంది. అయితే ఓ విషయం గుర్తుంచుకో. ఇంతకు ముందు ఏమీ చదవకపోయినా ఇక నుంచి మంచి పుస్తకాలు చదువు. మనుషుల్ని చదువు. అదే నీ పెట్టుబడి".

"తప్పకుండా నండి" అన్నాడు రచిత్.

"చెహోవ్ ఏమన్నాడో చెబుతాను. నువ్వు కథ రాస్తున్నప్పుడు గోడమీద తుపాకి వుందని రాస్తే కథ పూర్తి అయ్యేలోపు అది పేలాలి. లేకుంటే తుపాకి గురించి రాయకు అని. అర్థం అయిందనుకుంటాను".

"అర్థం చేసుకుంటాను గురువు గారూ".

"నువ్వు కూడా నన్ను గురువు అంటున్నావా? ఇంక మీరు బయలు దేరండి-కిలాడి శీను తప్ప" అన్నాడు పరమాత్మ. ఇద్దరూ ఆయనకు పాదాభివందనం చేశారు.

"లేవండి లేవండి. ఈ ఇండస్ట్రీలో మీరు నిలబడటానికి తగ్గ లక్షణాలున్నాయి. కాళ్లకు ఎవరయినా దండం పెడితే ఈ సినిమా వారు మురిసిపోతారు. అందుకని కొంత మంది నడుములు ఇక్కడ వంగే వుంటాయి" అన్నాడు పరమాత్మ.

"అయ్యో-నేను అడ్డమైన వారి పాదాలకు వందనాలు చేసి చివరికిలా మిగిలాను. ఇప్పటికీ బామ్ రాయించుకుంటాను" అన్నాడు కిలాడి.

"అందుకని మీరు నమ్మాల్సింది పాదాలను కాదు స్క్రిప్ట్ లను" అన్నాడు పరమాత్మ.

"మీ ఇద్దరూ కింద వెయిట్ చేయండి. నేను పది నిముషాల్లో వస్తాను" అని వారిని పంపించాడు.

"ఏంటోయ్ శీనూ... ఎవరీ పిల్లలు? ఏమిటి వారితో నీకు సంబంధం?"

"వీళ్లది మా ఊరు. మా జోగిగాడు పంపాడు. నేను ఈ రంగంలోకి వచ్చాక మా ప్రాంతం వాళ్లు సహాయం చేశారు. అనగా ప్రాంత ప్రేమ. అంతకు మించిన సంబంధం లేదు. వీళ్లు ఫర్వాలేదంటారా? వీళ్ల భవిష్యత్తు ఎలా వుండబోతోంది?"

"అది చెప్పటానికి నేను ఎవరిని! రేపు వాళ్లు ఇండస్ట్రీని ఏలవచ్చు. కొత్త వారిని గురించి మనం వెంటనే ఏ కామెంటూ చేయకూడదు. రచిత్ రేపు కిలాడి–2 అని రాసి బ్లాక్ బస్టర్ ఇవ్వవచ్చు" అన్నాడు పరమాత్మ.

"మళ్లీ కిలాడీ నా?" అన్నాడు కి.శీను.

"పోనీ కిలేడి" అనుకో. అందులో కుసుమ హీరోయిన్ కావచ్చు. ఆ సినిమా నిర్మాత నువ్వు కావచ్చు" అన్నాడు పరమాత్మ.

"అయ్యా మీ మాటలు వింటుంటే రేపటి సినిమా నాకు కనిపిస్తోంది గురూజీ. మీరు ఏదో పుస్తకం రాస్తున్నారని నాకు తెలుసు. దాని గురించి తెలుసుకోవచ్చా?"

"చెత్త సినిమాలు తీయటం ఎలా?!"

"ఈ పుస్తకం ఎవరన్నా కొంటారా గురూజీ?"

"భలేవాడివే. మంచి సినిమా ఎలా తీయాలంటే ఎవరూ కొనరు. మనం చెత్త మధ్య, చెత్త సినిమాల మధ్య బతుకుతున్నాం".

"అలాంటి సినిమాల గురించి ప్రత్యేకంగా చెప్పాలంటే రా!"

"ఒక్కోసారి చెప్పాలోయ్. నువ్వు కిలాడి సినిమా తీసినట్లు. ఇప్పుడు తీసుంటే ఆ సినిమా బ్లాక్ బస్టరు. నువ్వు ముందే కూసిన ఏ పక్షివో నిర్ణయించుకో. సినిమాల్లోనూ, సాహిత్యంలోనూ టైమ్స్ వుంటాయి. పిల్లలు చూస్తుంటారు. వెళ్లిరా!" అన్నాడు పరమాత్మ.

★ ★ ★

అదో టి.వీ. సీరియల్ షూటింగ్.

'క్లాప్', 'సైలెన్స్', 'ఏక్షన్' లాంటి మాటలు వినిపిస్తున్నాయి. ఓ పిస్టల్ పేలిన సౌండ్. 'అమ్మా' అని అరుపులు. మరో పిస్టల్ గర్జన. పారిపోతున్నాడు. 'పట్టుకోండి' 'ఛేజ్' అన్న అరుపులు – సుమోలు పరుగులు తీస్తున్నాయి. 'కట్ కట్' అరుస్తున్నాడు దర్శకుడు.

★ ★ ★

పరమాత్మ ముందు ముగ్గురూ వున్నారు.

"మిస్టర్ రచిత్... ఎలా వుంది నీ షూటింగ్ అనుభవం?"

"అది టీ.వీ. సీరియల్ అన్నారు గాని సినిమా తీస్తున్నారు. ఆ రచయితో, దర్శకుడో చెహోవ్ ని చదివారనిపించింది సర్".

"రియల్లీ" అన్నాడు పరమాత్మ.

"అవునండి. మాకు సెట్ నిండా తుపాకులు కనిపించాయి".

"అవునయ్యా... పిస్టల్ అద్దె రోజుకి పదిహేను వందల నుండి రెండు వేలు. అందుకని ఓ డజన్ పిస్టల్స్ కొన్నారు" అన్నాడు కి.శీను.

"పని మనిషి దగ్గర నుండి హీరో, హీరోయిన్, ఆడ విలన్ల వరకు అందరి దగ్గర వున్నాయి సర్. గోడ మీదో చేతుల్లోనో తుపాకులు చూపించారు కాబట్టి అవి ఢాం ఢాం అని చెహోవ్ గారు చెప్పినట్లు పేలుతున్నాయి. సుమోలు సరే సరి. ఇది కౌబాయ్ సినిమానా అని అనుమానం వచ్చింది సర్" అన్నాడు రచిత్.

"క్రియేటివిటీ పరుగులు తీస్తోందన్న మాట. రెండో యూనిట్ లేదా?"

"ఉందండి. అక్కడో కోడలు మెట్ల మీద నూనె పోస్తోంది" అంది కుసుమ.

"మెట్ల మీద పోయక బాండీలో పోస్తారా? అత్తగారు మెట్ల మీద నుండి జారి పడిపోవాలి కదా! నూనెను చూపించినప్పుడు ఎవరో ఒకరు జారాలి" అన్నాడు కి.శీను.

"ఇంకో అత్తగారు పాలల్లో ఏదో పొడి కలుపుతున్నారు" అంది మళ్లీ కుసుమ.

"ఇలాంటి విలన్లను ఎప్పుడూ చూడలేదా?" పరమాత్మ ప్రశ్న.

"లేదండి. మా దగ్గర మాటల యుద్ధమే. అది కూడా ఎల్లమ్మ మేదో పుల్లమ్మ మేదో, తడికెల మీదో పెట్టి తిట్టుకుంటారు" అంటోంది కుసుమ.

"నువ్వుండు కుసుమా... గురువుగారూ మన కుసుమ నక్కని తొక్కింది. రేపటి నుండి యంగ్ విలన్ గా ఎంట్రీ... తొలి షూటింగ్" అన్నాడు కి.శీను.

"మీరు ఏమీ అనుకోవద్దు. వారి మాటలు విన్నాను. ఇంతకు ముందు విలన్ గా నటించిన అమ్మాయి యిబ్బంది పెడుతోందని చంపేశారంట. నన్ను ఎప్పుడు చంపుతారో తెలియదు?"

"అలాంటి అనుమానాలు పెట్టుకోకు. ఇక్కడ తుపాకులే మనుషుల్ని చంపవు. రచయితలు, దర్శకులు, నిర్మాతలు ఎవరయినా చంపుతారు. ఆ విలన్ యిబ్బంది పెట్టటం వల్ల నీకు అవకాశం వచ్చింది. ఎంకి పెళ్లి సుబ్బి చావుకు రావటం అంటే ఇదే. అంచేత నువ్వు యిబ్బంది పెట్టనంత కాలం నీకు ఢోకా లేదు" అన్నాడు కి.శీను.

"రచిత్ ని పరిచయం చేయలేదా?" అన్నాడు పరమాత్మ.

"ఎందుకు చేయలేదు గురూజీ. నీ రైటింగ్ బాగుంటుందా? ముందు అసిస్టెంట్ గా చేయమన్నారు. మెయిన్ రైటర్ చేతి రాత బాగుండదు. ఫెయిర్ కాపీ రాయాలి".

"ఏమంటావోయ్ రచిత్?"

"ఆలోచిస్తున్నాను సర్. ముందయితే ఏదొక పని చేయాలి కదా!"

"రచయితలు కూడా సమయానికి స్క్రిప్ట్ ఇవ్వకుండా యిబ్బంది పెడుతుంటారు. అప్పుడు నీకు అవకాశం వస్తుంది. అలా పైకి వచ్చిన వారు చాలా మందున్నారు. కాకపోతే నీకు రెమ్యునరేషన్ ఇవ్వరు. షూటింగ్ జరిగినప్పుడు భోజనం పెడతారు".

"ఫర్మాలేదండి. తీరిక దొరికినప్పుడు మిమ్మల్ని కలుస్తాను. మెళకువలు తెలుసుకోవటానికి".

"నా చిట్కాలు నీకు అవసరం లేదు రచిత్. గోడ మీద తుపాకి ఎలా పేలుతుందో నువ్వు చూశావు. అక్కడ నీకు చాలా మంది పాఠాలు నేర్పుతారు. నువ్వు సినిమాలనే ఫాలో అవ్వు. సాహిత్యం, జనం అవసరం లేదు. నువ్వు ఇంటలెక్చువల్ వని తెలియనీయకు. అక్కడ ఉండనీయరు".

"అంతే నంటారా?" అన్నాడు రచిత్.

"ఇంకా అనుమానం ఎందుకు? ఇది మాస్ మీడియా అంటారు. తెల్లకాగితాల మీద తుపాకులు మోగించే వాడు, బాంబులు పేల్చేవాడు. ఎవరికేం కావాలో అది రాసిచ్చే వాళ్లు కొంత కాలం అక్కడ సుఖంగా వుంటారు".

"ఇది పద్మ వ్యూహం నాయనా. నీకంటే మహా రచయితలు ఫిల్మ్ నగర్ లో ఎంతో మంది వున్నారు. ఎప్పుడు డైలాగ్ ఎవడు రాస్తాడో. స్క్రీన్ ప్లే రాస్తాడో తెలియదు. అలాంటివి మా గురువు గారు చెప్పరు. జోగిగాడికి నేను యిచ్చిన మాటను నిలబెట్టుకున్నాను. ఇక నుంచి మీ బతుకు మీరు బతకండి. ఇంక మీరు బయలు దేరండి" అన్నాడు కిలాడి శీను.

"మధ్యలో వదిలేస్తున్నారు శీను గారూ...." అన్నారిద్దరూ.

"చివరిదాకా మీతో వుంటానని ఎగ్రిమెంట్ రాశానా. ఇప్పటి దాకా చేసింది ఎక్కువ. అమ్మా కుసుమా... నన్ను గుర్తుంచుకో" అన్నాడు శీను.

"అంత మాట అనొద్దు. నన్ను హీరోయిన్ గా మీరే పరిచయం చేయాలి" అని ఇద్దరూ వారికి పాదాభివందనం చేసి వెళ్లిపోయారు.

"ముదురుతున్నారంటారా?" అన్నాడు కి.శీను.

"ఎవరు ముదురు ఎవరు లేత అని చెప్పటానికి మనమెవరం శీను. ఇందులోకి ఎందరో వస్తుంటారు. పోతుంటారు. నువ్వు ఇక్కడే వుంటావా? ఇంకేదయినా పని చేసుకుంటావా?"

"పోయిన చోట వెతుక్కోమన్నారు కదా గురూజీ!"

"చివరికి పేకాటకి, కళకి, సినిమాకి తేడాలు చెరిపేశావు".

"అంత మాట అనకండి. చెరపటానికి నేను ఎంతటి వాడిని!"

"శీనూ... ఎవరి పరిధి మేరకు వారు డామేజ్ చేయటమేనడుస్తున్న చరిత్ర. చెహోవ్ చెప్పింది నిజం. మనం దేని గురించి చెప్పదలుచుకున్నామో అది కథ ముగిసేలోగా పేలాలి. ఇప్పుడు నా ఆఖరి పుస్తకం పేరు మిథ్య. ఈ ప్రపంచం మిథ్య" అన్నాడు పరమాత్మ. ★★★★★★